# రహస్యం

-పులిపాక కనకదుర్గ

ఎప్పట్లా అయిదు గంటలకే మెలకువ వచ్చింది రాధకు.

కార్తీక మాసపు చలికి ముసుగుదీసుకుని పడుకున్న పిల్లల్ని మురిపెంగా చూసుకుంది. దుప్పట్లను సరిచేసి మంచం దిగింది.

పిల్లలతో సమానంగా పడుకున్న భర్తను చూసి నవ్వుకుంటూ బయటకు నడిచింది. బ్రష్ చేసుకుని ఫిల్టర్ డికాషన్ తీసింది. పనమ్మాయి రాగానే గిన్నెలు బయటేసి పిల్లల్ని, భర్తని నిద్రలేపింది.

"ఇంకొంచెంసేపు పడుకుంటాం మమ్మీ" గారంగా అన్నాడు సన్నీ.

"ఇవ్వాళ యూనిట్ టెస్ట్ ఉంది కదా నాన్నా? కాసేపు చదువుకోవద్దు మరి" బుజ్జగింపుగా చెప్పి ముఖాలు కడిగించి పాలు కలిపి ఇచ్చింది.

ఇంత జరుగుతున్నా ఇంకా గాఢ నిద్రలోనే ఉన్నాడు రమేష్.

పిల్లల్ని పెంచటంకంటే ఈయనను లేపటం కష్టం భర్తను నిద్రలేపుతూ అనుకుంది రాధ.

"ఏంటోయ్ అప్పుడే ఏడయ్యిందా?" బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ అన్నాడు రమేష్.

"మీరలా పడుకునే ఉంటే పది కూడా దాటుతుంది. లేచి బ్రష్ చేసుకుంటే కాఫీ కలిపి ఇస్తాను" ముద్దుగా విసుక్కుంది.

నవ్వుతూ బయటకు నడిచేడు రమేష్.

గదిలోనే బిక్కుబిక్కుమంటూ కూర్చుంది వర్ధనమ్మ.

తల్లిని అలా చూడగానే చివుక్కుమంది రమేష్ మనసు.

ఓ రోజెప్పుడో ఉదయాన్నే హాల్లో కూర్చుంది వర్ధనమ్మ.

లేవగానే బొట్టులేని వర్ధనమ్మ మొహం చూడాల్సొచ్చినందుకు రాధ ఎంత యాగీ చేసిందో ఇంట్లో అందరికీ గుర్తే.

అప్పట్నించీ అందరూ లేచేవరకు గదిలోంచి బయటకు రావటం మానుకుంది.

చదువుకుని ఉద్యోగం చేస్తున్న రాధకు ఈ మూఢనమ్మకాలేమిటో అర్థం కాలేదు రమేష్‌కు. అత్తగార్ని సాధించటానికి రాధ ఎంచుకున్న మార్గాల్లో అదొకటని క్రమేణా అతనికి తెలిసొచ్చింది.

ఇంటిని అద్దంలా ఉంచుతుంది.

పిల్లల్ని చక్కగా చదివిస్తుంది.

ఇహ తననయితే ఏ లోటూ రాకుండా చూసుకుంటుంది.

అంతా బాగుంది కానీ అత్తా, ఆడపడుచులంటేనే రాధకు ఎంతమాత్రమూ గిట్టదు.

అన్నీ తెలిసినా ఏనాడో రాధ అందానికి దాసుడయిన రమేష్ ఆమెని మందలించలేడు. రమేష్ బలహీనత రాధకు బాగా తెలుసు.

"అమ్మ కాఫీ తాగిందా?" కాఫీ కప్పు అందుకుంటూ అడిగాడు రమేష్.

అత్తగారి ప్రస్తావన రాగానే రాధ మొహంలో రంగులు మారేయి.

"ఆవిడకు జరిగే మర్యాదలకు లోటు రాదు కానీ మీరు త్వరగా తెమలండి" విసురుగా అనేసి అక్కడ్నించి కదిలింది రాధ.

స్నానం కానించి వచ్చేడు రమేష్.

హాట్‌పేక్‌లో వేడివేడి పెసరట్లు ఎదురుచూస్తున్నాయి.

కొబ్బరిచట్నీ వేసుకుని టిఫిన్ పూర్తి చేశాడు. కమ్మగా, రుచిగా ఉంది టిఫిన్.

రాధ అద్భుతంగా వంట చేస్తుంది.

స్కూల్ బస్ రాగానే టాటా చెప్పేసి పిల్లలు బాక్సులతో వెళ్లిపోయారు.

"మీ లంచ్ బాక్స్ సర్దేసి డైనింగ్ టేబుల్ మీద పెట్టాను. మర్చిపోకుండా తీసుకెళ్లండి" హడావిడి పడుతూ ఆఫీసుకు వెళ్తూ చెప్పింది రాధ.

రాధ ఆఫీసు ఇంటికి బాగా దూరం. రోజూ ఆఫీసుకు బస్సులోనే వెళ్తుంది.

రాధ వెళ్లిన అరగంటకు బయలుదేర్తాడు రమేష్.

కోడలు బయలుదేరిన తరువాత కొడుకు దగ్గరకు వచ్చింది వర్ధనమ్మ.

"ఏంటమ్మా డబ్బేమయినా కావాలా?" పేపరు పక్కన పడేస్తూ అడిగేడు రమేష్.


"ప్రమీల దగ్గర్నించి ఉత్తరం వచ్చిందిరా. ఎల్లుండి మీ బావగారితో ఇక్కడికొస్తున్నారు. పాపం వాళ్ల పరిస్థితి ఏమీ బాగా లేదురా" విచారంగా అంది ఆవిడ.

"ఏదైనా డబ్బు సాయం చేయాలమ్మా?" నెమ్మదిగా అన్నాడు.

జాలిగా చూసిందావిడ రమేష్ వైపు.

తల వంచుకున్నాడు రమేష్.

"దానికి మన సాయం ఎందుకు? ఎలాగూ దానికివ్వాల్సిన వడ్డాణం, కాసులపేరూ ఉన్నా



యిగా. ఎప్పటికయినా నా నగలు దానికి చెందాల్సి నవేగా.''

"ముందు వాళ్లని రానీ, తరువాత చూద్దాం'' అప్పటికి తప్పించుకోటానికి అన్నాడు రమేష్.

వర్ధనమ్మకు పుట్టింటివాళ్లు పెట్టిన పెళ్లినాటి నగలవి.

వడ్డాణం పాతిక తులాల పైనే ఉంటుంది. కాసులపేరు, వంకీలు కలిపి మరో పాతిక తులాలుంటాయి.

ఎప్పట్నించో ఆ నగలు కూతురికి ఇచ్చెయ్యాలని వర్ధనమ్మ కోరిక.

కానీ రాధే పడనీయటం లేదు.

పెళ్లి చేసి పంపాక ఆడపిల్లకు పుట్టింటి మీద హక్కులు ఉండవని తగవు పెట్టుకుంటోంది.

ఇప్పుడీ ఉత్తరం వచ్చిన తరువాత ఈ గండం ఎలా గడుస్తుందో అన్న దిగులు మొదలయ్యింది తల్లీ కొడుకుల హృదయాల్లో.

"నేను వెళ్తున్నానుగానీ తలుపులేసుకో'' ఆఫీసుకెళ్తూ చెప్పాడు రమేష్.

రమేష్ అలా వెళ్లాడో లేదో ఇలా వచ్చింది పని మనిషి రత్తాలు.

"చేతిలో ఆ డబ్బా ఏమిటే?'' ప్రశ్నించింది వర్ధనమ్మ.

"కిరసనాయిలు దొరకదుటకదమ్మ. దొరికినప్పుడే తీసుకొచ్చాను. మా ఇంటికాడ ఉంటే అందరూ అడుగుతారు.



# విషంతో వైద్యం

పక్షవాతం, రక్తం గడ్డ కట్టడం, బ్రెయిన్ సెల్స్ డేమేజ్ కావడం, ఎపిలెప్సీ మొదలైన వ్యాధులకు సాలీడు విషం ద్వారా మందులు తయారు చేసి పోస్తే వ్యాధులు తగ్గుతాయని అమెరికన్ న్యూరో సైంటిస్టులు కనుక్కున్నారు. సాలీళ్లను వేలసంఖ్యలో పెంచి అతి కష్టమైన పద్ధతిలో వాటి విషాన్ని సేకరించి ఈ అద్భుత ప్రయోగాలు చేస్తున్నట్లు చెప్పారీ శాస్త్రవేత్తలు.


# సబల

ఆ... ఆడపిల్లా అని తీసి పారేయకండి. ఆడవాళ్ళు అబలలు అన్నది పాత మాట అని నిరూపిస్తోంది 24 సంవత్సరాల నీనా మహేంద్ర మెహతా. సముద్ర మట్టం నుండి 18,383 అడుగుల ఎత్తు వున్న ఖర్దుంగ్లాను సైకిల్ తొక్కుతూ చేరింది. ఇలా ఖర్దుంగ్లాకు చేరుకున్న తొలి మహిళ ఈమె. మృత్యువు నీడలా వెంటాడే పర్వత రహదారులపైన సైకిల్ తొక్కుతూ చేరుకుందంటే ఇది సామాన్యమైన విషయం కాదు కదా మరి. అందుకే రికార్డు బద్దలు కొట్టిందీమె.

# పిల్లులపెంపకం

ఏ రామ చిలుకనో, ముద్దొచ్చే కుక్క పిల్లల్నో పెంచుకుంటాం మనం. అయితే ఇటీవల థాయ్‌లాండ్‌లో, హాంకాంగ్‌లోని బౌద్ధ భిక్షువులు ఈ పిల్లుల పెంపకం మొదలుపెట్టారు. ఈ పిల్లుల బ్రేక్‌ఫాస్ట్, లంచ్‌కి సుమారుగా మన కరెన్సీలో ఒక్కో పిల్లికి అక్షరాల నూట యాభై రూపాయలు ఖర్చు అవుతాయిట. ఈ పిల్లులకు వేక్సిన్ కూడా ఇప్పిస్తున్నారుట.

**-మౌన**



మీ ఇంట్లోనే ఉండనీయండమ్మా. తరువాత తీసుకెళ్తాను'' ఇరవై లీటర్ల క్యాన్‌ని వర్ధనమ్మ గదిలో పెడుతూ అంది రత్తాలు.

***

సీరియస్‌గా పనిచేసుకుంటోంది రాధ.

తల్లి మూడ్ గమనించిన పిల్లలు అల్లరి చేయకుండా కామ్‌గా పుస్తకాలు ముందేసుకు కూర్చున్నారు.

రమేష్ కూడా ఏదో పుస్తకంలో తల దూర్చాడు.

"భోజనాలకి రండి'' ఎనిమిది దాటాక వచ్చి పిలిచింది రాధ.

రోజూ భోజనాల దగ్గర గోలగోలగా ఉంటుంది. ఆ పూట మాత్రం భిన్నంగా నోరెత్తకుండా భోజనాలు చేసి ఎవరి గదుల్లోకి వారెళ్లి పడుకున్నారు.

"మీ బావగారు వాళ్లు ఎందుకు వస్తున్నారుట?'' డైనమేట్ పేలనే పేలింది.

"ఏది నాక్కూడా తెలిస్తేగా!'' నసిగేడు రమేష్.

"కానీ నాకు తెలుసు. ఏం చేసినా ఆ నగలను మాత్రం ఇచ్చే ప్రసక్తి లేదు. పాతవాటిని చెరిపేసి కొత్త డిజైన్‌లో నగలు చేయించుకోవాలని చాలా రోజుల్నించి అనుకుంటున్నాను. ఇంకొన్నేళ్లు పోతే మన చిన్నికి కూడా పనికొస్తాయి'' తెగేసి చెప్పింది రాధ.

***

అనుకున్న రోజుకు ప్రమీలావాళ్లు వచ్చేశారు.

ముక్తసరిగా పలకరించింది రాధ.

అదే మూడ్‌లో ఆఫీసుకు వెళ్లింది రాధ.

"ఈ విషయం తెలుసా?'' సీట్లో కూర్చోక ముందే వచ్చింది రమ్య.

"ఏమయ్యింది?'' కీడుని శంకించింది రాధ మనస్సు.

"నీరజని రాత్రి వాళ్ల అత్తగారువాళ్లు కిరోసిన్ పోసి చంపబోయారుట. తెలివిగా తప్పించుకుని బయటపడిందట.

ఆఫీసులో అందరికీ తెలిసిపోయింది. అయినా నీరజ తెలివయ్యింది. జరగబోయే దాన్ని ముందుగానే తెలుసుకుని తప్పించుకోగలిగింది. అదే ఇంకొకళ్లయితే అన్యాయంగా బలయిపోయే వాళ్లు'' చెప్పేసి వెళ్లిపోయింది రమ్య.

"నీరజలాంటి మంచి పిల్లకే ఈ గతి పడితే ఇహ రాకాసి కోడళ్లను ఏం చేయాలో?''

ఆఫీసులో గుసగుసలన్నీ రాధ చెవిన పడుతూనే ఉన్నాయి.

అత్తింటివారి మంచితనం గుర్తుకొచ్చి హృదయం కలుక్కుమంది.

వర్ధనమ్మ ఏనాడూ రాధను కోడలిలా చూడలేదు.

ప్రమీలను ఎంత ప్రేమగా చూసుకునేదో అంతే ప్రేమగా రాధను కూడా చూసేది.

పెళ్లినాటికే రాధ ఉద్యోగం చేస్తోంది.

రాధ ఆఫీసు నించి ఇంటికి వచ్చేసరికి వేడివేడిగా టిఫిన్ చేసి పెట్టేది. దగ్గరుండి కొడుకు, కోడల్ని షికార్లకు పంపించేది. పిల్లలు పుట్టాక కూడా రాధ ఎలాంటి టెన్షన్లు లేకుండా ఆఫీసుకు వెళ్లగలిగేది.

అత్తగారే పిల్లల ఆలనాపాలనా చూసుకునేది. ఇహ రమేష్ సంగతి సరేసరి.

రాధను ఎప్పుడూ అపురూపంగానే చూసుకుంటాడు. వాళ్ల మంచితనాన్ని అలుసుగా తీసుకుని రాధ క్రమంగా ఇంటి పెత్తనాన్ని చేజిక్కించుకుంది.

'అయినా అత్తగారి నగల మీద తన పెత్తనం ఏమిటి? నిజంగానే పాపం ప్రమీలా వాళ్ల పరిస్థితి బాగోలేదు.

పోనీ ఆ నగలను ప్రమీలకు ఇయ్యటానికి ఒప్పుకుంటేనో' కొన్ని క్షణాలు మెత్తపడింది రాధ హృదయం.

కానీ నగలు గుర్తుకు రాగానే కళ్లు మిరుమిట్లు గొలిపాయి.

'అమ్మో! ఇంకేమయినా ఉందా? ఎప్పటికయినా తను అంత బంగారం కొనగలదా? నగలను చేయించుకోగలదా?' ఏమయినా సరే నగలను ఇవ్వటానికి ఒప్పుకోకూడదని గట్టిగా నిర్ణయించుకుంది.

అలా నిర్ణయం తీసుకున్నాక మనస్సు కాస్త తేలిక పడ్డట్టయ్యింది.

ఫైళ్లు ముందేసుకుని పని చేసుకోవటం మొదలెట్టింది.

ఎందుకో అనీజీగా అనిపించింది.

మధ్యాహ్నం లంచ్‌టైమ్ అయ్యేసరికి విపరీతమైన తలనొప్పి మొదలయ్యింది రాధకు. విధి లేక హాఫ్ డే సి.ఎల్. ఇచ్చి ఇంటికి బయలుదేరింది. బస్సులో వెళ్లే ఓపిక లేక ఆటోలో ఇంటికి వెళ్లింది.

ఇంటి ముందర రమేష్ స్కూటర్ చూసి ఆశ్చర్యపోయింది.

ఆ సమయంలో రమేష్ ఇంటి దగ్గర ఎందుకున్నాడో అర్థం కాలేదు.

గేటు తీసుకుని లోపలకి వెళ్లింది.

వీధి తలుపు దగ్గరకు వేసి ఉండడంతో తలు

వులు తోసుకుని లోపలికి వెళ్లింది.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

'వీళ్లంతా ఏమయిపోయారబ్బా?' ఆశ్చర్యపోయింది రాధ.

సిమెంట్ చప్టా దగ్గరకు వెళ్లి కాళ్లు కడుక్కుంది. కళ్లు తిప్పి చూసింది.

భర్త, అత్తగారు, ఆడపడుచు గోడవారగా నిలబడి గుసగుసలాడుకుంటున్నారు.

ఆ సమయంలో అక్కడ అలా రహస్యంగా మంతనాలు జరపాల్సిన అవసరం ఏమిటో రాధకు అస్సలు అర్థం కాలేదు.

ఏదో తెలియని అనుమానం మనస్సులో ప్రవేశించింది.

అకస్మాత్తుగా రాధను అక్కడ చూడటంతో ముగ్గురూ తొట్రుపడ్డారు.

ఆ విషయం రాధ దృష్టిని దాటిపోలేదు.

"ఏం రాధా అప్పుడే వచ్చేశావేం?" అదుర్దాగా ప్రశ్నించాడు రమేష్.

"ఏమ్మా ఒంట్లో బాగోలేదా?" వాడిపోయిన రాధ వదనాన్ని ఆప్యాయంగా అడిగింది వర్ధనమ్మ.

"తలనొప్పిగా ఉంటేనూ..." నీరసంగా సమాధానం చెప్పి తను గదిలోకి నడిచింది.

నీరజ సంఘటన ప్రభావమో ఏమో మనసులో తెలియని గుబులు ప్రవేశించింది.

మంచంమీద పడుకుందన్న మాటేగానీ విపరీతమైన ఒళ్లు నొప్పులు ప్రారంభమయ్యాయి.

అమృతాంజనం తీసుకొచ్చి సున్నితంగా నుదుటిమీద రాయసాగాడు రమేష్.

వేడివేడి కాఫీతో లోపలికొచ్చింది వర్ధనమ్మ.

"కాస్త వేడి కాఫీ తాగి పడుకోమ్మా తలనొప్పి అదే తగ్గిపోతుంది" రాధను ప్రశాంతంగా వదిలేసి ఇద్దరూ వెళ్లిపోయారు.

సాయంత్రానికి జ్వరం తగిలిందేమోనన్న అనుమానం కలిగింది రాధకు.

థర్మామీటర్ అత్తగారి గదిలో ఉన్నట్టు గుర్తు. లేని ఓపికను తెచ్చుకుని నెమ్మదిగా అత్తగారి గదిలోకి నడిచింది.

థర్మామీటర్ కనిపించలేదుగానీ గోడను ఆనుకుని దెయ్యంలా కిరోసిన్ టిన్ కనిపించింది.

ఒక్కసారి ఉలిక్కిపడింది.

'ఇంట్లో రెండు గ్యాస్ సిలెండర్లు ఉండగా కిరోసిన్ ఎందుకు?

అదీ అంత రహస్యంగా అత్తగారి గదిలో దాచాల్సిన అగత్యం ఏముంది?' భయంతో శరీరం కంపించిపోయింది.

అయిపోయింది. అంతా అయిపోయింది. నీరజలాంటి మంచి అమ్మాయినే అత్తింటివారు ఎంతో సతాయిస్తున్నారు.

తనలాంటి గయ్యాళి కోడల్ని ఎవరు మాత్రం ఎంతకాలం భరిస్తారు?

ఎంతగానో ప్రేమించే భర్త... తనకు ఎంతో అలుసయిపోయాడు. అమ్మలా ఆదరించిన అత్తగార్ని తను ఏనాడూ గౌరవించలేదు. చివరకు ఆవిడ పుట్టింటి వారు ఇచ్చిన నగల మీద కూడా తన పెత్తనమే!

అత్తగారి మంచితనాన్ని అలుసుగా తీసుకుందే తప్ప అది వారి సంస్కారానికి నిదర్శనమని గ్రహించలేకపోయింది. తనకిలాంటి శాస్తి జరగాల్సిందే.

"కానీ పిల్లలు...?"

దాహంతో నాలిక పిడచకట్టుకుపోయింది. శారీరకంగా బలహీనమైన రాధ మానసికంగా విపరీతంగా భయపడిపోయింది.

స్పృహ కోల్పోతున్న రాధకు రమేష్ పొదవి పట్టుకోవడమే తెలుసు.

రాధకు జ్వరతీవ్రత నూట రెండుకు చేరుకుంది.

డాక్టరు వచ్చి ఇంజెక్షన్ ఇచ్చి వెళ్లారు.

రాత్రంతా ఒకటే కలవరింతలు. మెలకువ వచ్చినప్పుడల్లా రమేష్‌ని, వర్ధనమ్మను చూసి గజగజ వణికిపోయింది.

"వద్దండీ, నన్నేం చేయొద్దు. మీకు దండం పెడతాను నన్ను వదిలెయ్యండి. ఇహ నించి మీరు చెప్పినట్టే వింటాను. ఆ నగలు కూడా నాకొద్దు ప్రమీలకు ఇచ్చెయ్యండి. ఇంకెప్పుడు మీకు ఎదురుచెప్పను" దీనంగా వేడుకుంది.

రాధ అంతగా ఎందుకు భయపడిపోయిందో ఎవరికీ అర్థం కాలేదు.

మరో రెండు రోజులకు జ్వరం నెమ్మదిగా తగ్గింది.

ఈ మధ్యలో రత్తాలు తన కిరోసిన్ డబ్బా తీసుకుపోయింది.

అత్తగారి గదిలో కిరోసిన్ టిన్ మాయమవడంతో తేలికగా ఊపిరి పీల్చుకుంది రాధ.

ఆడపడుచుకి చీర సారెతోపాటు అత్తగారి నగలు కూడా ఇచ్చి సాగనంపింది.


వర్ధనమ్మకు, రమేష్‌కు మాత్రం రాధలో వచ్చిన ఆకస్మిక మార్పుకు కారణం అంతు చిక్కలేదు.

'ఏమయితేనేం ఆమెలో మార్పు వచ్చింది, అదే పదివేలు' అనుకున్నారిద్దరూ.

రాధ మటుకు తప్పిపోయిన గండాన్ని (?) తలుచుకుని గుండెల మీద చెయ్యి వేసుకుంది.

అసలు విషయం మాత్రం 'రహస్యం'గానే ఉండిపోయింది.

★



## అవకాశాల వేదిక

మేని బరువులతో సతమతమయ్యే రాశి ఇప్పుడు తరగని అందంతో మళ్లీ అవకాశాలకి వేదికగా మలచుకుంటోంది. ఈమధ్యకాలంలో గ్లామర్ పాత్రలతో అలరిస్తున్న రాశి ఇప్పుడు మళ్లీ రాజేంద్రప్రసాద్ సరసన నటిస్తోంది. 'ఒక పెళ్లాం ముద్దు రెండో పెళ్లాం వద్దు' అంటున్న రాజేంద్రప్రసాద్‌ని తన అందంతో రెచ్చగొడుతోంది. లవర్‌బాయ్‌గా రాజేంద్రప్రసాద్ ఈ చిత్రంలో డిఫరెంట్‌గా కన్పించనున్నాడు. రాజేంద్రప్రసాద్ సరసన రెండో హీరోయిన్‌గా గుర్లిన్‌చోప్రా నటిస్తోంది. 'ఆయుధం' సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమైన గుర్లిన్‌చోప్రా ఇప్పుడు మంచి గ్లామర్‌తో ఆకట్టుకుంటోంది.

